కథానిక

# 'సబ్‌వే'లో సత్యభామ

యస్. ఆర్. వారణాశి

అసలు శర్మ బొంబాయి అంటే ఎందుకో పడి చచ్చేవాడు. అదొక పెద్ద పట్టణం. ఇండియా ముఖద్వారం, బహుముఖంగా పురోభివృద్ధి చెందిన మేటి సిటీ అని తనకు తెలుసు. అందుకనే పశ్చిమ రైల్వేలో గుమాస్తా ఉద్యోగానికి ఖాళీలు ఉన్నాయని తెలిసి ఒక ధరఖాస్తు పడేసాడు ఎంతో ఉత్సాహంతో.

శర్మ వాల్తేరులో బి. యస్. సి. ప్యాసయినాడు. స్వగ్రామం భీమవరం. చామనఛాయ మనిషి. పొడుగుకి తగ్గవళ్ళు అతని హుందాతనానికి మెరుపు తీర్చిదిద్దేది. పరీక్ష ప్యాసయిన నాటినుంచి ఉద్యోగం సంపాదన ఒక గట్టి సమస్యగా పరిణమించింది శర్మకి. జీవితం ఒక వడ్డించిన విస్తరి అన్న మనస్తత్వం శర్మది. ఒక్క మాటలో చెప్పాలంటే శర్మ ఆశావాది.

ఒకరోజు శర్మ వాలుకుర్చీలో కూర్చుని దినపత్రిక చదువుతున్నాడు. గోవాలో బుడతకీచులు ఇండియానుంచి వెళ్ళిన సత్యాగ్రహులను కాల్చి చంపినట్లు, దయాదాక్షిణ్యంలేని ఈ పోర్చుగీసు వాళ్ళు దేశం వదిలి వెళ్ళేట్టులేరని, పెద్ద మహాసామ్రాజ్యాధికారులైన బ్రిటిష్‌వారే పోర్చుగీసు వారికంటె మంచివారని, ఏమేమో అభిప్రాయాలు బుఱ్ఱలో జెఱ్ఱులులా పరుగెత్తాయి. ప్రకృతి అంతా శోభాయమానంగా ఉంది. మలయమారుతపు పిల్లగాలులు తను కూర్చున్న డ్రాయింగు రూము కిటికీలోంచి వీస్తూన్నాయి. రాత్రి పిండారబోసినట్లుగా కాసిన వెన్నెలలో మంచుకు తడసి కాబోలు కొబ్బరి మొక్కలు తలారబోసుకుంటూన్నట్లుగా కిటికీలోంచి కనపడుతూ ఉన్నాయి. చెట్లపై పక్షులు కిలకిలారవములు చేస్తున్నాయి. పొగలు గుప్పుతూఉన్న ఫిల్టరుకాఫీ త్రాగుతూ, అప్పుడప్పుడు నిరాశగా బాహ్యంలోకి చూస్తూన్నాడు శర్మ. తలుపు నెట్టిన చప్పుడు అయింది. ఏముంది పశ్చిమ రైల్వేనుంచి వచ్చిన కవరు ఇచ్చి పోయాడు పోస్టుమేన్. ఇంటర్‌వ్యూకి రమ్మనిఉంది. రేడియో నుంచి కాబోలు "బృందావనమిది అందరిదీ, గోవిందుడు అందరివాడేగా" అన్నపాట మోతగా వినపడుతోంది. శర్మ నిజంగా ఇంటర్‌వ్యూ రావడంతో ఇంటిలోకి పరుగెత్తికెళ్ళి విషయాన్ని విశదపర్చి ఎవరెస్టు హీరోలా ఫీలయ్యాడు.

చెక్కపూటుగా భోజనంచేసి, కాలక్షేపం చేస్తున్న శర్మకు ఏవో క్రొత్త అనుభూతులు పొడగట్టసాగాయి. ఊళ్ళో తన స్నేహితులందరికీ తన ఇంటర్‌వ్యూ విషయం తెలిసిపోయింది. కాని లోలోన శర్మ ఏదో బాధపడుతూ ఉండేవాడు. కష్టపడి పెంచి పెద్దవాడిని చేసి, చదువు సంధ్యలు చెప్పించిన తలిదండ్రులకు శర్మ బొంబాయి ఉద్యోగానికి వెళ్ళటం సుతరామూ ఇష్టంలేదు. దేశం కాని దేశం వెళ్ళటం అదొక అఘాయిత్యంలా అనిపించింది ఆ తలిదండ్రులకు.

సాయంత్రం అలా వాహ్యాళికని తన స్నేహితుడు రామంతో కలిసి కాలేజీకేసి వెళ్ళాడు. ఆకాసం మబ్బుతో వల్లెవాటు వేసుకొన్నది. పిల్లగాలులు మెల్లగా వీస్తోంటే. సొమ్మసిల్లిరాలిపోతున్నాయి కాలేజీ తోటలోని కాడమల్లి చెట్టు పూవులు. ఆకాసపు ఏ కొననుంచో, పిల్లనగ్రోవి ఊదినట్లున్నది కోయిల కూస్తూంటే శర్మకు ఆ సమయంలో 'నిండిన కొలను'లా ఉంది మనస్సు.

"ఏరా శర్మా.నువ్వు నిజంగా అదృష్టవంతుడివిరా బొంబాయి ట్రిప్పుకొట్టేస్తూన్నావు" అన్నాడు రామం కొంటెగా.

"ఏమోరా బ్రదర్ మా నాన్నగారికి ఏమీ ఈ ప్రొపోజలు ఇష్టంలేదురా" అన్నాడు శర్మ బరువుగా.

"అవునులేరా మన తెలుగువాళ్ళకుండే జబ్బేరా అది. దేశంవదలి మరొకచోటకు పోయేకంటె కడు

పుల్లోనీళ్లుకదలకుండా ఊళ్లో బడిపంతులుఉద్యోగం నయం అంటారు. నిజంగా నువ్వు ఆలోచిస్తే ఆల్ ఇండియా సర్వీసులలో మన తెలుగు వాళ్ళు ఎందరున్నారు అంటావు. బహుతక్కువ. ఐ ఏ. ఎస్ పరీక్షలకు వెళ్ళే తెలుగువాళ్ళు ఎందరున్నారు. సెలక్టుఅయిన వాళ్ళు ఎందరు? మనం నిజంగా అరవవాళ్ళను చూచి చాల నేర్చుకోవాలి శర్మా. అరవవాళ్లు అండమాన్సులో గుమాస్తాగిరి దొరికితే ఎగబడిపోతారు." అన్నాడు రామం ఉపన్యాస ధోరిణిలో. రామం చెప్పినమాటలు అన్నీ నిజం అన్నట్లుగా శర్మవిన్నాడు, చీకటి రేఖలు బాగా అలుముకున్నాయి. ఇద్దరూ మాటామంతీ అనుకుంటూ గృహోన్ముఖులైనారు.

శర్మ బొంబాయి ప్రయాణసన్నాహాలు పూర్తిచేసుకున్నాడు. "వాడీ కోచ్" నిడదవోలులో ఎక్కాడు బొంబాయికి టిక్కెట్లు పుచ్చుకొని. తల్లిదండ్రులకు కొడుకు బొంబాయి వెళ్ళటం మనస్కరించక పోయినా, గట్టిగా అభ్యంతరం పెట్టలేకపోయినారు. శర్మ బయలుదేరిన తర్వాత తల్లిదండ్రుల ముఖాలు ముచికనుంచి జారిన పువ్వులవలె విలవిలలాడేయి.

పట్టాలపై రైలుబండి పొగలు గుప్పుకుంటూ రెండు రోజుల తర్వాత బొంబాయి చేరింది. శర్మ దాదరులో దిగిపోయాడు. స్టేషనుకు దగ్గరలో ఉన్న ఒక మద్రాసీ లాడ్జిలో చేరాడు. రైల్వే ఆఫీసు ఇంటర్వ్యూకి పెళ్ళాడు. అడిగినవాటికి సమాధానాలు బాగానే చెప్పాడు. ఆరోజు "మెట్రో" థియేటరులో సినిమా చూచాడు. ఆ హాలులో ఆ చల్లదనము అతనిని ఎంతో ముగ్ధుడిని చేసింది. సినిమా చూసాక, గాయకుడు రాగాలాపన కోసం సిద్ధంగా ఉంచిన తీగలాఉంది అతని మనసు.

శర్మ బియస్సి పరీక్ష ఇచ్చివచ్చినప్పటినుంచి శర్మతండ్రిరామారావుగారు కొడుకుపెళ్ళివిషయమై తీవ్ర ఆలోచనలు ప్రారంభించారు. దానికి కారణాలు లేకపోలేదు. రామారావుగారికి శర్మ ఒక్కగాని గాని ఒక్క కొడుకు. ఏదోఒక పుట్టినేల సుక్షేత్రమయిన మాగాణి ఉంది. అందుకనే ఎన్నో సంబంధాలు వచ్చినాయి. ఊళ్లో కరణం కామరాజు గారికి వాళ్ళమ్మాయి శారదను శర్మకిచ్చి చేయాలని అభిప్రాయం ఉంది. నిజానికి రామారావుగారితో లోగడ ఆ విషయం ప్రస్తావించి ఉన్నారు కూడా. శారద చురుకైనపిల్ల. ఈడూ జోడూ బాగానే ఉంటుంది. కాదంటే కొంచెం చామనఛాయి మనిషి. బావ బావంటూ తరచూ శర్మగారింటికివచ్చి ఏవోలెక్కలు అవీ చెప్పమని అడిగి చెప్పించుకొని మెరుపుతీగలా ఇట్టే ఇంటికి తుఱ్ఱుమనేది.

శర్మకు శారద అంటే ఇష్టంలేకపోలేదు. ఆమె పాట ఎండిన మోడులను సైతం చిగురించగలదనడంలో అతిశయోక్తి ఏమీలేదు. "ఎందరో మహానుభావులు," "రామ నీ సమానమెవరురా" అన్న త్యాగయ్య కీర్తనలు చక్కగా పాడుతూండేది అమ్మ అడిగితే.

శర్మకు ఇంటర్వ్యూ అయిన రెండురోజులలో క్లార్కుగా ఉద్యోగం అయింది. అతనికీ చాల ఆశ్చర్యంవేసింది. ఇంత సులభంగా ఉద్యోగం చిక్కినందుకు. ఇంటికి టెలిగ్రాము ఇచ్చాడు ఉద్యోగవార్త తెల్పుతూ. తలిదండ్రులకు తెగిన పూలులా మారాయి మనస్సులు. లోకమే ఒకతీరు. సంఘంలో పిల్లలపెళ్ళి తలిదండ్రుల బాధ్యత అయి కూర్చుంది. అది తీరేవరకు వాళ్ళకు మనశ్శాంతి ఉండదు. పెంచి పెద్దవాళ్ళ చేయడమేకాని ఈ రోజుల్లో చదువుకున్న పిల్లలు తలిదండ్రులమాటలు వింటారా అని వాపోయాడు రామారావుగారు.

ఐసువుగా ఆరునెలలు ఉద్యోగంలో సర్వీసు నెట్టుకుంటూవచ్చాడు శర్మ. కాని ఒకరోజు ఎప్పటిలాగే శర్మ దాదరునుంచి చర్చిగేటుకి రైల్లో ఆఫీసుకి బయలుదేరాడు. కొత్తగా కట్టబడిన ఆ సబ్‌వే చూడటానికి జనం చాలామంది వస్తున్నారు. బొంబాయిలో ఇండియాలో మొట్టమొదటిసారిగా ఆ సబ్‌వేని కట్టించి ఆ ఘనతను బొంబాయి కార్పొరేషనువారు గడించుకొన్నారు. తన ముందుగా జార్జెటు సిల్కుచీర కట్టుకుని, తెల్లని లిస్టులిను రవిక తొడుగుకొని, తలలోని మల్లెలు ఘుమఘుమవాసనలు గ్రుప్పుతూ ఒక సుందరాంగి వెళ్ళడం కనిపెట్టక పోలేదు. శర్మకు ఒక్కసారిగా గ్రుక్క తిరగలేదు. అతని చూపులు ఆమెతో ఏమో అర్థంకాని అంతర్యంతో సంభాషించాయి. అంతలోనే కనువిప్పులో ఒక సంఘటన

జరగడంకూడా అయింది. ఆ సబ్ వేలో అరటి తొక్కపై ఆమె కాలువేసి నడవడం—జారి నేలపై పడింది ఆ లలామ. నిలువునా జారిపడటంచేత బరువుగాయాలు తగిలాయి. చేతి గాజులు చితికి చేతికి ఫ్రాక్చరు అయింది. శర్మ వెంటనే ఆమెను తనచేతులతో లేవదీసాడు. చాలా కంగారుపడ్డాడు. కాని ఆమె చేతిలోని తెలుగుపత్రిక గుండెదడ వేగాన్ని తగ్గించింది. ఆ పుస్తకంపై ఆమె పేరు "సత్యభామ" అని కూడా చదివాడు. వెంటనే టాక్సీ పిలిచి దగ్గరలోనే వున్న "బొంబాయి హాస్పిటలు"కు తీసుకుపోయాడు ప్రథమ చికిత్సకై.

ప్రథమ చికిత్సచేసి డాక్టరు కట్టు కట్టాడు. ఇంటికి తీసుకు వెళ్ళవచ్చునని కూడా చెప్పాడు. "ఏమండీ బాగా గాయాలు తగిలాయి. బాధ ఎక్కువగా ఉందా" అన్నాడు శర్మ ముక్కూ మొగము ఎరగని ఆమెతో ఆప్యాయంగా.

"అబ్బే మీకు శ్రమయిచ్చినందుకు విచారిస్తూన్నాను. మీకు చాల ధన్యవాదాలు" అంది ఆమె ఏమనాలో తెలియక.

"దానికేమి లెండి చేతనయిన సహాయం చేసాను. మరి మీకు అభ్యంతరం లేకపోతే ఇంటివద్ద చేర్చి మరీ వెడతాను" అన్నాడు శర్మ ధైర్యంగా.

మౌనం అంగీకార సూచన అని శర్మ ఆమెను వారింటివద్దకు తీసుకువెళ్ళి దిగబెట్టాడు దాదరులోని హిందూకాలనీలో. సత్యభామ ఇంటిలో అందరూ ఆశ్చర్యచకితులైనారు.

అసలు సత్యభామకూడా రైల్వేలోనే పని చేస్తోంది. ఆమెతండ్రి స్టెనోగ్రాఫరుగా ఒక యూరపియను ఫర్ములో పనిచేస్తున్నాడు. ఆయనకు అంతా ఆడ సంతానమే. కాదంటే అందరూ కొద్దో గొప్పో చదువుకొన్నారు. ఆ సంఘటన జరిగిననాటినుంచీ శర్మ రోజూ ఆమెను ఆఫీసులో కలుసుకొంటూనే ఉన్నాడు. సత్యభామ మెట్రిక్యులేషను ప్యాసుఅయి రైల్వేలోనే చేరింది క్లార్కుగా. శర్మతో తరచూ మాట్లాడ్డం ఆమె రోజూ కోరుకొనేది ఎందుకో కాని. ఆమెకు శర్మనుచూస్తే ఏంతో ఆనందం, మనశ్శాంతి కలుగుతుంది. వారి స్నేహం ప్రేమగామారడానికి ఎంతో కాలంపట్టలేదు.

సత్యభామ, శర్మను తరచూ వాళ్ళ యింటికి రమ్మనమనేది. సత్యభామ తండ్రికి శర్మ అంటే కొద్ది కాలంలోనే మంచిగురి ఏర్పడింది కూడా. దానితో శర్మకు ఒక అనుభూతి కలిగింది.

నెలలు రోజులులా గడచిపోతున్నాయి. శర్మ తండ్రి రామారావుగారు సెలవుపెట్టి ఇంటికిరమ్మని కొడుక్కి వ్రాసారు. శర్మకు సెలవు దొరికింది కూడాను. అప్పటికే శర్మ తన మకాం సత్యభామ తండ్రిపట్టుదలపై వాళ్ళయింటికిమార్చడం అయింది. శర్మ తండ్రి ఇంటికి రమ్మనడంలో ఆంతర్యం తెలియక పోలేదు. పెళ్ళి విషయం తప్పకుండా ప్రెస్ చేస్తారు అని తెలుసు. కాని తనకు సత్యభామే ప్రపంచం. ఆమె లేనిదీ తనకు జీవితంలేదు. వాళ్ళ ఆప్యాయత, ఆమె సౌందర్యం, ఆమె ఆ చల్లని చూపులు అతనిని బాగా ఆకర్షించాయి. ప్రేమించి పెండ్లి చేసుకోవడంలో తప్పు తనకు ఏమీ కనబడ లేదు. హృదయమిచ్చి, ఆరాధించే తన సత్యభామ ప్రేమను కాలగన్నగలడా? తన చదువు, సంస్కారం ఏమి చెప్పుతున్నాయి. జీవితంలో సహధర్మచారిణిగా ఉండే తన భార్య యిష్టానుగుణంగా ఉండాలి. ఏదో మొఖమాటంకోసం తల్లిదండ్రులు నెత్తినరుద్దిన ఒక బండను తన జీవితాంతంవరకూ మోయగలడా! అతనికి ఆలోచనలు తెంపు తెగలేదు.

సత్యభామ ఒకరోజు చెప్పనే చెప్పింది. తను శర్మనే నమ్ముకున్న నున్నది. అతనే తన ప్రేమమూర్తి అంది. ఇంతకంటె తనకు కావలసినదేదేముంది? కులం అడ్డురాదు. కనుక సత్యభామనే పెళ్ళిచేసుకుంటానన్న నిశ్చయానికి వచ్చేసాడు. అలా నిశ్చయానికి వచ్చిన రెండురోజులకు సత్యభామతో రిజిష్టరు వివాహం చేసుకున్నాడు శర్మ. సత్యభామతో సహా మరీ ఇంటికి వెళ్ళాడు. రామారావుగారుకి గుక్క తిరగలేదు. కాని శర్మకు ఎదురీత మంచిదికాదని రామారావుగారు మారు మాట్లాడలేదు.

ఈ లోకంలో ఎవరు ఎవరికోసం పుట్టారన్నది చెప్పలేం. సముద్రపు టుప్పు, అడవి ఉసిరి - కలసినట్లు, ఎక్కడనుంచో కొట్టుకొచ్చిన జతపడ్డ జీవితాలు ఏకమైపోతాయి. జన్మ ఎత్తిన తర్వాత తల్లిదండ్రులకు ఇష్టంగా వివాహం చేసుకోవడం ఉల్లంఘించరాని అపచారమైపోయినది. కాని సబ్ వేలో సత్యభామలుంటారని ఎవరికి తెలుసు?